# సాక్షి పల్నాడు


శుక్రవారం । 28 । ఫిబ్రవరి । 2025

I




## స్వామివారికి విశేష అలంకరణ

పిడుగురాళ్ల: పట్టణంలోని నాగులగుడిలోని గంగా పార్వతి సమేత భవానీ శంకరస్వామికి గురువారం విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 530.60 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 4,364 క్యూసెక్కులు విడుదలవుతోంది.



## స్ట్రాంగ్ రూంల పరిశీలన

లక్ష్మీపురం: ఏసీ కళాశాలలోని స్ట్రాంగ్ రూముల్లో పోలింగ్ బాక్సులను భద్రపరిచే ప్రక్రియను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, జేసీ ఏ భార్గవ్ తేజ పరిశీలించారు.

## న్యూస్‌రీల్

### త్రికోటేశ్వరుని తిరునాళ్ల ఆదాయం రూ. 1.77 కోట్లు

నరసరావుపేట రూరల్: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవస్థానానికి రూ.1,77,68,172 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ డి.చంద్రశేఖరరావు తెలిపారు. ఆలయ హుండీ కానుకల లెక్కింపు గురువారం నిర్వహించారు. కానుకల ద్వారా రూ.73,47,918, పూజా టికెట్లు విక్రయం ద్వారా రూ.65,01,070, ప్రసాదాల ద్వారా రూ.38,17,395, అన్నదానం, ఇతర సేవలు, స్కీములకు రూ.1,01,789 లభించినట్లు వివరించారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది రూ.14.19లక్షల అదనంగా వచ్చినట్లు పేర్కొన్నారు. దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ చంద్రకుమార్, ఉప కమిషనర్ కేబీ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు శ్రీధర్‌రెడ్డి, సుధాకర్‌లు పర్యవేక్షించారు. యల్లమంద చైతన్య గోదావరి బ్యాంక్, దేవదాయ, ఆలయ సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు.

### వైభవంగా లింగోద్భవ పూజలు



నరసరావుపేట రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకొని కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారికి లింగోద్భవ పూజలు వైభవంగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి 12గంటల నుంచి ప్రారంభమైన పూజలు తెల్లవారుజాము వరకు కొనసాగాయి. పంచామృత ఫలరసాలు, సుగంధద్రవ్యాలతో మహాన్యాస పూర్వక మహా రుద్రాభిషేకాన్ని కనుల పండుగ్గా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆలయ ట్రస్టీ రామకృష్ణ కొండలరావు, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ చంద్రకుమార్‌లు అభిషేకాల్లో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో లింగోద్భవ పూజలను తిలకించారు. ఆలయ ఈఓ డి.చంద్రశేఖరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### 'క్వారీ' తిరునాళ్ల ఆదాయం రూ.16.37 లక్షలు



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం తిరునాళ్ల ఆదాయం గత ఏడాది కన్నా ఈ ఏడాది గణనీయంగా పెరిగినట్లు దేవదాయశాఖాధికారులు తెలిపారు. దేవస్థానం వద్ద గురువారం దేవదాయశాఖాధికారులు హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమంను నిర్వహించారు. హుండీ కానుకల ద్వారా రూ.6,72,636, అభిషేకం, ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.6,76,195, వివిధ రకాల వేలం ద్వారా 2,88,800 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. దేవస్థానానికి మొత్తంగా రూ.16,37,631లు ఆదాయం సమకూరిందని దేవదాయశాఖాధికారి పోతుల రామకోటేశ్వరరావు తెలిపారు. గత ఏడాది రూ.14,00,692 ఆదాయం రాగా గత ఏడాది కన్నా ఈ దఫా రూ.2,36,939 అదనపు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

### నందివాహనంపై మల్లేశ్వరుడు



మంగళగిరి టౌన్: మంగళగిరిలోని గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలల్లో భాగంగా స్వామి కల్యాణ మహోత్సవం అనంతరం గురువారం ఉదయం స్వామివారు నందివాహనంపై భక్తులకు దర్శనభాగ్యం కల్గించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన ఈఓ జేవీ నారాయణ ఉత్సవ నిర్వహణను పర్యవేక్షించారు. గ్రామోత్సంలో గంగా భ్రమరాంబ సమేతుడైన మల్లేశ్వరుడు పురవీధుల్లో విహరించారు.

### యార్డులో 1,03,526 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 99,747 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,03,526 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,500 వరకు పలికింది.

# 'పెద్దల' ఎన్నికపై పచ్చ కుట్ర

## 'పట్టభద్రుల' పోలింగ్‌లో బరితెగించిన టీడీపీ నేతలు

- బెదిరింపులు.. ప్రలోభాలు
- ప్రజాస్వామ్యానికి కూటమి తూట్లు
- పీడీఎఫ్ సానుభూతిపరులను పోలింగ్ కేంద్రాలకు రాకుండా బెదిరింపులు
- బెల్లంకొండ, వెల్దుర్తి, మాచర్లలో పీడీఎఫ్ ఏజెంట్లు రాకుండా అడ్డుకున్న టీడీపీ నేతలు
- విచ్చలవిడిగా దొంగ ఓట్లు వేసిన కూటమి కార్యకర్తలు
- దొంగ ఓట్లు అడ్డుకున్నందుకు పిడుగురాళ్ల పీడీఎఫ్ ఏజెంట్ పై దాడికి యత్నం
- కూటమి నేతలు రిగ్గింగ్ చేస్తూ ఎన్నికలను అపవిత్రం చేశారన్న మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి
- ఎన్నికల్లో గెలవడానికి ప్రభుత్వం బరితెగించిందన్న వామపక్షాలు




అమరావతి పోలింగ్ బూత్‌లో కూటమి నేతల అక్రమాలను అడ్డుకోవాలని ఎన్నికల అధికారులకు సూచిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు

సాక్షి, నరసరావుపేట: పట్టభద్రుల కోటాలో పెద్దల సభకు జరిగిన ఎన్నికల్లో కూటమి నేతలు అరాచకంతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. కృష్ణా – గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగ్గా, పల్నాడు జిల్లావ్యాప్తంగా టీడీపీ నేతలు బరితెగించారు. పోటీలో 25 మంది ఉన్నప్పటికీ ప్రధానంగా పోటీ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు, టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజాల మధ్య జరిగింది. సార్వత్రిక ఎన్నికల్లో గెలవడం కోసం ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. ముఖ్యంగా గ్రూప్–2, డీఎస్సీ లాంటి ఉద్యోగ నియామకాల వ్యవహారం, నిరుద్యోగ భృతి, యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన, జాబ్ క్యాలెండర్, ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం లాంటి ఎన్నికల హామీలను ఏవీ అమలు చేయకపోవడంతో పట్టభద్రులు కూటమి ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారు. ఆ ప్రభావంతో కూటమి అభ్యర్థి ఓడిపోతున్నాడని గ్రహించిన ఆపార్టీ నేతలు అక్రమాలకు తెరలేపారు. గతంలో ఎన్నడూ రాజకీయాలకు అతీతంగా జరిగిన పట్టభద్రుల ఎన్నికల్లో ఈదఫా కూటమి నేతలు బరితెగించారు.

### కూటమి అక్రమాలు కొన్ని...

- బెల్లంకొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో కూటమి నేతల అక్రమాలను ప్రశ్నించిన సీపీఎం మండల కార్యదర్శి చిన్నం పుల్లారావుపై టీడీపీ నేతలు దౌర్జన్యం చేశారు. అంతటితో ఆగకుండా ఆయనపైనే పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయాలని ఒత్తిడి తెచ్చారు.



- వెల్దుర్తి మండల కేంద్రంలో జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 331 పోలింగ్ కేంద్రంలో పీడీఎఫ్ ఏజెంట్లను కూటమి నేతలు బయటకు నెట్టేశారు. దీంతో ఓటింగ్ రాని ఓట్లను సైతం టీడీపీ నేతలే రిగ్గింగ్ చేశారు. ఇదే విధంగా మాచర్ల నియోజకవర్గంలో సైతం ఏజెంట్లను ఉండనివ్వలేదు. ఒకవేళ ఉండనిచ్చినా నోరు మెదపనివ్వకపోవడంతో మిన్నకుండిపోయారు.
- చిలకలూరిపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే పుల్లారావు పోలింగ్ కేంద్రాలలో హల్‌చల్ చేశారు. అన్ని కేంద్రాలను పదే పదే తిరుగుతూ ఏజెంట్లను భయాందోళనకు గురిచేసి తన అనుచరుల చేత రిగ్గింగ్ చేయించారు. రిగ్గింగ్ ఆపండి అన్నందుకు పీడీఎఫ్ ఏజెంట్ పేరుబోయిన వెంకటేశ్వర్లను బలవంతంగా బయటకు నెట్టి దాడిచేశారు.
- అమరావతి మండలంలోని పోలింగ్ బూత్ నెంబర్ 339లో కూటమి నాయకులు దొంగ ఓట్లు పాల్పడుతున్నాన్న సమాచారంతో అక్కడికి వెళ్లిన పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుతో కూటమి నేతలు వాగ్వివాదానికి దిగారు. దీంతో తాను ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని లక్ష్మణరావు తెలిపారు.
- రొంపిచర్లలో టీడీపీ నాయకులు వందకు పైగా దొంగ ఓట్లు వేశారని పీడీఎఫ్ ఏజెంట్లు ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది.
- పిడుగురాళ్లలో మధ్యాహ్నం తరువాత కూటమి నేతలు దొంగ ఓట్లు వేయడం ప్రారంభించారు. దీన్ని పీడీఎఫ్ ఏజెంట్లు అడ్డుకోవడంతో కూటమి నేతలు పెద్దసంఖ్యలో వామపక్ష, విద్యార్థి సంఘాల నాయకులతో గొడవకు దిగారు.

### జిల్లాలో పోలింగ్ శాతం 77.33

నరసరావుపేట: కృష్ణా– గుంటూరు పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 77.33శాతం పోలింగ్ జరిగినట్లు కలెక్టర్ పి.అరుణ్‌బాబు గురువారం సాయంత్రం వెల్లడించారు. మొత్తం ఓటర్లు 56,964మందికాగా, వారిలో పురుషులు 30,643, మహిళలు 13,640మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు.

### ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు...



విద్యావంతులు, ఉన్నత ఆలోచనలు కలిగిన వారిని చట్టాల రూపకల్పనలో భాగస్వామ్యం చేయాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన శాసనమండలి ఎన్నికలను టీడీపీ అపహాస్యం చేసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఎన్నికల్లో రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. తమ పార్టీ కార్యకర్తలను ఏజెంట్లుగా కూర్చొబెట్టి దొంగ ఓట్లు వేయించుకున్నారు. ఓటమి భయంతోనే కూటమి నేతలు ఈ కుట్రలకు పాల్పడ్డారు. అంతేకాకుండా ఓటర్ల జాబితా కూడా తప్పుల తడకగా అధికారులు తయారు చేశారు. ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీ ఓట్లు ఇబ్బడి ముబ్బడిగా ఉన్నాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జరిగిన అక్రమాలను ఎన్నికల సంఘం గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి.

– గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే

### బయటకు నెట్టి.. రిగ్గింగ్ చేసుకున్నారు



ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్దకు తిరుగుతూ పీడీఎఫ్ ఏజెంట్లు, ఓటర్లపై బెదిరింపులకు పాల్పడ్డారు. రిగ్గింగ్ చేస్తాం సహకరించమని మమ్మల్ని టీడీపీ నేతలు ఉదయం అడిగారు. ఒప్పుకోకపోవడంతో మధ్యాహ్నం నుంచి నన్ను బయటకు నెట్టేశారు. న్యాయం చేయమని చిలకలూరిపేట టౌన్ సీఐను అడగ్గా టీడీపీ నేతలకు అనుకూలంగా వ్యవహరించి నా హక్కులు కాలరాశారు. ఏజెంట్లు లేకపోవడంతో టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా రిగ్గింగ్ చేసుకున్నారు. మా పోలింగ్ కేంద్రంలో రీపోలింగ్ జరపాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేస్తున్నాం.

– పేరుబోయిన వెంకటేశ్వర్లు, చిలకలూరిపేట 384 పోలింగ్ స్టేషన్ పీడీఎఫ్ ఏజెంట్

### బెదిరించారు..



ఎన్నికలు న్యాయబద్ధంగా జరగాలి. పౌరులు ఓటు హక్కును వినియోగించుకునే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో జరగాలి. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. యువకులు, మహిళలు ఒక్కొక్కరు రెండుఓట్లు వేశారు. వారిని గుర్తించి అడ్డుకుంటే అధికార పార్టీ నాయకుల నుంచి బెదిరింపులు వస్తున్నాయి.

– ఏపూరి గోపాలరావు, పల్నాడు జిల్లా రైతు సంఘం నాయకుడు

### దొంగ ఓట్లు వేశారు



పిడుగురాళ్ల పట్టణంలో కొంతమంది దొంగ ఓట్లు వేసే ప్రయత్నాన్ని మేం అడ్డుకోవటం జరిగింది. కూటమి ప్రభుత్వ నాయకులు కొంత మంది దౌర్జన్యానికి దిగినప్పటికీ మనోధైర్యంతో న్యాయం కోసం పోరాడాం. అయినా కొంతమంది కూటమి నేతలు దొంగ ఓట్లు వేశారు.

– తెలకపల్లి శ్రీనివాసరావు, సీపీఎం మండల కార్యవర్గ సభ్యుడు, పిడుగురాళ్ల

# చూసిన కనులదే భాగ్యము



అమరావతిలో అమరేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న జనవాహిని

## వైభవంగా అమరేశ్వరుని దివ్య రథోత్సవం

- ఉభయ దేవేరులతో ఊరేగిన అమరేశ్వరుడు
- శివపంచాక్షరి నామంతో మార్మోగిన అమరారామం
- భక్తజన సంద్రంగా అమరావతి



కల్యాణ వేదికపై ఉత్సవమూర్తులు

అమరావతి: మహాశివరాత్రి ఉత్సవాలలో అమరావతి క్షేత్రంలో వేంచేసియున్న శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి దివ్య రథోత్సవం గురువారం సాయంత్రం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమరావతి, ధరణికోట గ్రామాలకు చెందిన చింకా, ఆలపాటి, కోనూరు వారి వంశస్తులు తమ గుర్రాలకు రంగులు వేసి ఊరేగింపుగా తెచ్చి స్వామివారికి సమర్పించారు. ఈ గుర్రాలను రథంపై ముందు భాగంలో అలంకరించారు. మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఉభయదేవేరులతో కూడిన అమరేశ్వరుడిని గాలిగోపురంలో ఉంచి పూజలు నిర్వహించారు. స్వామి వారి దివ్యరథానికి ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ పర్యవేక్షణలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, వాస్తు మండపారాధన, రథాంగ హోమం, రథ సంప్రోక్షణ, రథ బలి కార్యక్రమాలను నిర్వహించి అష్టదిక్పాలకులు శాంతి కోసం కుంభంపోసి దీపారాధన చేయటంతో రథోత్సవం ప్రారంభ క్రతువును పూర్తి చేశారు.

### సర్వాంగ సుందరం..

వివిధ రకాల, రంగురంగుల పూలతో సర్వాంగసుందరంగా అందంగా అలంకరించిన దివ్యరథంపై ఉభయదేవేరులతో కూడిన అమరేశ్వరుని కొలువుదీర్చారు. స్వామి వారి రథోత్సవాన్ని సుమారు నాలుగున్నర గంటలకు ప్రారంభించారు. ఆలయ గాలిగోపురం వద్ద నుంచి ప్రారంభమైన రథోత్సవం వేలాది మంది భక్తులు స్వామివారి రథాన్ని గాంధీబొమ్మ సెంటర్ వరకు అక్కడ నుంచి వెనుదిరిగి శివనామస్మరణ చేస్తూ రథశాలలోకి చేర్చారు. మండల పరిధి గ్రామాల నుంచే కాక ఉమ్మడి గుంటూరు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో అమరావతి భక్తజన సంద్రమైంది.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

ఈ కల్యాణోత్సవానికి ప్రముఖ ఆధ్యాత్మిక వ్యాసరచయిత పీసపాటి నాగేశ్వరశర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కల్యాణోత్సవంలో ఆలయ అనువంశిక ధర్మకర్త, పాలక మండలి చైర్మన్ రాజావాసిరెడ్డి మురళీకృష్ణ ప్రసాద్ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలను, తలంబ్రాలను సమర్పించారు.

### వైభవంగా గ్రామోత్సవం

కల్యాణ మహోత్సవం అనంతరం గురువారం ఉదయం నంది, చిలుక, చిన్నర థంపై స్వామివారిని వైభవోపేతంగా ఊరేగింపు నిర్వహించారు. తొలుత కల్యాణ వేదికపై నుంచి అమ్మవార్లను, స్వామివారిని వాహనాలపై అలంకరించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు.

### కీలు గుర్రంపై..

బాలచాముండికా సమేత అమరేశ్వరుడికి గురువారం రాత్రి కీలుగుర్రంపై గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత అమరేశ్వరాలయం నుంచి గాంధీబొమ్మ సెంటరు వరకు ఈఉత్సవాన్ని నిర్వహించారు. బాల చాముండేశ్వరిదేవితో అమరేశ్వరుడు కీలుగుర్రంపై ఎక్కి నాలుగుదిక్కులు తిరుగుతూ ఉంటే భక్తజనం ఆసక్తితో తిలకించారు.



పురవీధులలో కీలుగుర్రంపై ఊరేగుతున్న బాల చాముండికా సమేత అమరేశ్వరుడు

### ఘనంగా కల్యాణోత్సవం

అమరావతి: ప్రముఖ శైవక్షేత్రమైన అమరారామ క్షేత్రంలో వేంచేసియున్న శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం బుధవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా మాఘ శుద్ధ చతుర్దశి నాడు ప్రధానమైన కల్యాణోత్సవం నిర్వహించారు. తొలుత బుధవారం రాత్రి స్వామివారికి లింగోద్భవకాలంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి రెండుగంటలకు స్వామివారికి, అమ్మవారికి ఎదుర్కోల మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవంలో విఘ్నేశ్వర పూజ, కన్యాదానం, మాంగళ్యధారణ, తలంబ్రాల క్రతువులను శాస్త్రోక్తంగా జరిపించారు.

### తిరుగు ప్రభల సందడి



కోటప్పకొండ నుంచి తిరిగి పట్టణానికి చేరుకుంటున్న ప్రభలు

నరసరావుపేట ఈస్ట్: మహాశివరాత్రి పర్వదినాన కోటప్పకొండ శ్రీత్రికూటేశ్వరస్వామి సన్నిధిలో జాగరణ చేసి మొక్కులు తీర్చుకున్న ప్రభలు గురువారం పట్టణానికి చేరుకున్నాయి. పట్టణం నుంచి బుధవారం సాయంత్రం బయలుదేరి వెళ్లిన ప్రభలు రాత్రి స్వామివారి సన్నిధిలో ఉండి గురువారం ఉదయం బయలుదేరి వచ్చాయి. ప్రభల నిర్వాహకులకు మార్గమధ్యంలో పలువురు ఉచిత అల్పాహారం అందచేశారు. అలాగే పట్టణంలో శివునిబొమ్మ సెంటర్, పల్నాడు బస్టాండ్ ప్రాంతాల్లో సైతం అల్పాహారాలు అందించారు. మరోవైపు దూరప్రాంతాలకు వెళ్లే యాత్రికులతో ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది. గత మూడురోజుల నుంచి కోటప్పకొండ వద్ద వ్యాపారాలు సాగించిన బొమ్మల దుకాణదారులు పట్టణంలోని ప్రధాన రోడ్లపై అమ్మకాలు జరిపారు. దీంతో పల్నాడు బస్టాండ్ ప్రాంతం నుంచి మల్లమ్మ సెంటర్ వరకు ట్రాఫిక్‌ను మళ్లించారు.





నరసరావుపేట మున్సిపల్ బాలుర పాఠశాలలో ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న జేసీ సూరజ్ గనోరే

## క్లుప్తంగా

### రైతులకు సమస్యలు లేకుండా చూడండి

రీసర్వేలో జాయింట్ కలెక్టర్



**బొల్లాపల్లి :** జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. పలు వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. రీసర్వే పనుల గురించి ఆరా తీశారు. మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న రీసర్వే పనుల్లో రెవెన్యూ శాఖ తరఫున ఎలాంటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు న్యాయం జరిగేలా చూడాలని తెలిపారు. తహసీల్దార్ ఏవీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### కాకాని ప్రభకు ప్రమాదం



**నరసరావుపేట రూరల్:** కాకాని విద్యుత్ ప్రభ ప్రమాదానికి గురైంది. కోటప్పకొండ తిరునాళ్ల నుంచి తిరుగు ప్రయాణంలో గురవాయపాలెం సమీపంలోని 10ఆర్ మేజర్ కాలువపై అదుపుతప్పి నేలకొరిగింది. హైటెన్షన్ వైర్లను దాటించే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. వెంట ఉన్న గ్రామస్తులు అప్రమత్తంగా ఉండటంతో పెనుప్రమాదం తప్పింది. మరో క్రేన్ సాయంతో ప్రభను కాలువనుంచి బైటికి తీసి సిద్ధం చేశారు. తర్వాత గ్రామానికి తరలించారు.

### ఘనంగా తెప్పోత్సవం



**నకరికల్లు:** మండలంలోని నర్సింగపాడు గ్రామంలో గల గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో తెప్పోత్సవం వేడుకలు గురువారం కనులపండువగా నిర్వహించారు. మహా శివరాత్రి వేడుకలను పురస్కరించుకొని ఆలయ అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. చల్లగుండ్ల గ్రామానికి చెందిన మడకా వెంకటేశ్వర్లు, రామతులసి, పొట్లపీడు గ్రామానికి చెందిన చుండూరు శివశంకర శ్రీనివాసరావు, వెంకట్రావమ్మల ఆధ్వర్యంలో తెప్పోత్సవం జరిపించారు. ఆలయంలోని కోనేటిని రంగురంగుల పూలతో శోభాయమానంగా అలంకరించారు. హంస వాహనంపై ఉత్సవమూర్తులు కొలువుదీరాయి. భక్తుల శివనామస్మరణ నడుమ తెప్పోత్సవం సాగింది.

# ఓటమి భయంతోనే కూటమి దాడులు

- దొంగ ఓట్ల కోసం రంగంలోకి ఎమ్మెల్యే దిగటం సిగ్గుచేటు
- ప్రజాసంఘాల నాయకుల ఆరోపణ



మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్, సలీమ్

**నరసరావుపేట:** ఉమ్మడి గుంటూరు–కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటమి భయంతో అధికార పార్టీ నాయకులు బరితెగించారని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. పీడీఎఫ్ అభ్యర్థికి చెందిన ఏజంట్లపై దాడులకు పాల్పడ్డారని తెలిపారు. పల్నాడురోడ్డులో పోలింగ్ బూత్ సమీపంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడుతూ... రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన ఈ ఎన్నికలలో టీడీపీ రాజకీయ నిరుద్యోగిని అభ్యర్థిగా నిలబెట్టి దౌర్జన్యానికి పాల్పడడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. టీడీపీ ఓటమి భయంతో రిగ్గింగ్ పాల్పడడం సిగ్గుచేటని చెప్పారు. నరసరావుపేట పట్టణం బరంపేట పోలింగ్ కేంద్రంలో స్వయంగా ఎమ్మెల్యే దగ్గర ఉండి కూలీలతో ఓట్లు వేయించడం దారుణమన్నారు. దీనిపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం దురదృష్టకరమని, అయినప్పటికీ కేఎస్ గెలుపు ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. సీఐటీ యూ నాయకుడు కొమ్ముల నాగేశ్వరరావుపై దాడి జరిగిందన్నారు. న్యాయవాదుల బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, న్యాయవాది బి.సలీమ్ మాట్లాడుతూ ఓటమి భయంతోనే టీడీపీ నాయకులు ప్రలోభాలకు గురిచేశారన్నారు. ఎన్నికల అ క్రమాలపై పోలింగ్ కేంద్రంలో ఉన్న వెబ్ కెమెరాల ఆధారంగా విచారణ నిర్వహించి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి భంగపాటు తప్పదని జోస్యం చెప్పారు. కూటమి నాయకులు మధ్యాహ్నం నుంచి దౌర్జన్యాలకు పాల్పడ్డారని, ఎమ్మెల్యే దగ్గర ఉండి ఓట్లు వేయించటం సిగ్గుచేటు అన్నారు. జిల్లా వ్యాప్తంగా 15 నుంచి 20 శాతం దొంగ ఓట్లు వేయించారన్నారు. ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి రెడ్‌బాషా మాట్లాడుతూ కూటమి నాయకులు దిగజారుడు రాజకీయాలకు పాల్పడ్డారన్నారు. లక్ష్మణరావు గెలుపు కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు అవుతుందన్నారు.

## ఎన్నికల్లో కూటమి నేతల దౌర్జన్యం దారుణం

- సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు విజయ్ కుమార్
- సత్తెనపల్లిలో ప్రజాసంఘాల నాయకుల నిరసన ప్రదర్శన



మాట్లాడుతున్న గుంటూరు విజయ్ కుమార్

**సత్తెనపల్లి:** పల్నాడు జిల్లాలో పీడీఎఫ్ ఏజెంట్లపై కూటమి నాయకుల దాడులు ఖండనీయం అని సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు విజయకుమార్ అన్నారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఈ దాడులు, దౌర్జన్యాలకు నిరసనగా పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని పుతుంభాక భవన్ నుంచి తాలూకా సెంటర్ వరకు గురువారం జరిగిన నిరసన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉండగా ఒకవిధంగా, అధికారంలోకి వచ్చాక మరోలా చంద్రబాబు వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. పలువురు పచ్చ నేతలు పీడీఎఫ్ ఏజెంట్లుపై దాడులు, దౌర్జన్యాలు చేసి రిగ్గింగు చేసుకున్నారని ఆయన ఆరోపించారు. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కి మద్దతుగా నిలిచే ఓటర్లు అధికంగా బెంగళూరు, హైదరాబాద్, విదేశాలలో ఉన్నారని గుర్తుచేశారు. వారు రాకపోయినప్పటికీ వారి బదులు దొంగ ఓట్లు వేసి రిగ్గింగ్‌కు పాల్పడడంతో ఒక్కో పోలింగ్ బూత్ లో 80 నుండి 91 శాతం వరకు ఓట్లు పోలయ్యాయి సాధారణ ఎన్నికలలో కూడా 80 శాతం నుంచి పోల్ కాని పరిస్థితులు ఉంటే ఈ ఎమ్మెల్సీ ఎన్నికలలో 80 నుండి 90 శాతం వరకు ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. 80 శాతం మించి పోలైన బూత్‌లలో రీపోలింగ్ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకుడు గద్దె చలమయ్య, కౌలు రైతు సంఘం నాయకుడు పెండ్యాల మహేష్, చేనేత కార్మిక సంఘం నాయకుడు కె. శివదుర్గారావులు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు డి విమల, జి ఉమాశ్రీ, మునగాజ్యోతి, ఎ వీరబ్రహ్మం, డి పుల్లారావు, పి ప్రభాకర్, పి.సూర్యప్రకాశరావు, రాజ్‌కుమార్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యం నిరాకరించిన ప్రభుత్వ డాక్టర్

ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన బాధితులు



ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలి కుమార్తె, కుటుంబ సభ్యులు

**చీరాల:** తాను చెప్పిన చోట మందులు కొనలేదని ఓ ప్రభుత్వ డాక్టర్ వైద్యం చేయడానికి నిరాకరించారని, అతడిపై చర్యలు తీసుకోవాలని బాధితులు చీరాల ఆర్డీఓకు గురువారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితురాలి కుమార్తె టి.మల్లేశ్వరి తెలిపిన వివరాల మేరకు.. మరియమ్మపేటకు చెందిన గుంజి వెంకాయమ్మ అనే వృద్ధురాలు ఆరోగ్యం విషమించడంతో ఈ నెల 19వ తేదీ రాత్రి చీరాల ఏరియా వైద్యశాలలో చేర్పించారు. ప్రభుత్వ వైద్యశాలలో పని చేస్తున్న ఓ డాక్టర్.. చీరాల మసీదు సెంటర్‌లోని ప్రాణహిత మల్టీస్పెషాలిటీ, క్యాన్సర్ హాస్పిటల్‌లో మందులు తెచ్చుకోవాలని రిఫర్ ( ఈ ఆస్పత్రులు సదరు డాక్టర్‌వి అని ఆరోపణలు ఉన్నాయి.) చేశారన్నారు. అయితే ఆ ఆస్పత్రుల్లో మందులకు బిల్లులు ఇవ్వాలని కోరగా దానికి వారు నిరాకరించడంతో తాము బయట మెడికల్ షాపులో తెచ్చి ఇచ్చామన్నారు. అందుకు డాక్టర్ కోపగించుకున్నారని ఆరోపించారు. తన తల్లి ఆరోగ్య పరిస్థితిని పట్టించుకోకుండా రిపోర్టు ఫైల్ విసిరేశారన్నారు. తన కుటుంబ సభ్యులను ప్రభుత్వ హాస్పిటల్ నుంచి బయటకు పంపించారని పేర్కొన్నారు. ఆయన చెప్పిన ఆస్పత్రుల్లోనే చేసిన పరీక్షల రిపోర్టులు ఇవ్వాలని కోరగా అడ్రస్ లేని ఆస్పత్రుల రిపోర్టులు ఇస్తున్నారన్నారు. మళ్లీ గట్టిగా ప్రశ్నిస్తే మిత్ర డయాగ్నోస్టిక్, డిజిటల్ ఎక్స్‌రేకి చెందిన రిపోర్టులు ఇచ్చారని తెలిపారు. సదరు డాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

## ప్రకృతి సాగుతో రైతులకు లాభం



అవగాహన కల్పిస్తున్న అమల కుమారి

**పెదకూరపాడు:** ప్రకృతి వ్యవసాయ విధానంలో మిరప పంట సాగు చేస్తూ అంతర పంటలు వేయటం వల్ల లబ్ధి కలుగుతుందని పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే అమలకుమారి రైతులకు సూచించారు. గురువారం పెదకూరపాడు మండలం లింగంగుంట గ్రామంలో రాష్ట్ర పరిశోధన బృందం మిరప పంట పొలాలను పరిశీలించింది. ప్రకృతి సాగు, ఆదాయం, ఖర్చుల వివరాలను సభ్యులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.అమలకుమారి మాట్లాడారు. మిరప వేసే ముందు 31 రకాల విత్తనాలను బీజామృతం విత్తన శుద్ధి చేసి పొలంలో చల్లి 45 రోజుల అనంతరం కలయ దున్నటం వలన ప్రయోజనం కలుగుతుందని రైతులు వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో సాగవుతున్న మిరప మొక్కలలో వ్యాధి నిరోధక శక్తి 20 నుంచి 23కు పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో పరిశోధన బృందం సభ్యులు హిమ బిందు, లీలావాణి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మధుబాబు, అమూల్య, ఉదయలక్ష్మి, జోత్స్న, రైతులు పాల్గొన్నారు.

### గుర్తుతెలియని యువకుడు మృతి



కాలువ వద్ద యువకుడి మృతదేహం


**చీరాల:** మున్సిపల్ కార్యాలయం ఎదుట గల కాలువ వద్ద గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని గురువారం రాత్రి గుర్తించారు. ప్రమాదవశాత్తు మరణించాడా.. లేక ఇతర కారణాలా అని తెలియాల్సి ఉంది. అయితే మృతుడికి సంబంధించిన ఎలాంటి వివరాలు లభించలేదు. పోలీసుల దర్యాప్తులో పూర్తి విషయాలు తెలియాల్సి ఉంది.

### అడ్డంగా బుక్కయ్యాడు

- చోరీకి పాల్పడుతూ దొరికిన దొంగ
- రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

**మార్టూరు:** ఓ ఇంట్లో చోరీకి పాల్పడుతూ ఇంటి యజమానులకు అడ్డంగా దొరికిపోయిన దొంగ ఉదంతం గురువారం సాయంత్రం మార్టూరులో జరిగింది. బాధిత కుటుంబం వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక మద్ది సీతాదేవి కాలనీకి చెందిన దంపతులు పచ్చవ శరణ్య, వెంకటేశ్వర్లు గురువారం మధ్యాహ్నం పనిపై బయటకు వెళ్లారు. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతాల్లో ఇంటికి వచ్చిన శరణ్య తమ ఇంట్లో ఎవరో ఉన్నట్లు గుర్తించి స్థానికులను అప్రమత్తం చేసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ఇంటి తలుపులు తెరిచి చూడగా 50 సంవత్సరాల వయసు గల అపరిచిత వ్యక్తి ఇంటి లోపల కనిపించాడు. బీరువా లోపల ఉండాల్సిన సుమారు రూ.5 లక్షల విలువైన 70 గ్రాముల బంగారు ఆభరణాలు అతని చేతిలో ఉండగా పోలీసులు వాటిని స్వాధీనం చేసుకొని నిందితుడిని స్టేషన్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఆరవ పటాలంలో శివరాత్రి వేడుకలు



**మంగళగిరి:** నగర పరిధిలోని 6వ బెటాలియన్‌లో గురువారం మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కమాండెంట్ కె. నగేష్‌బాబు దంపతులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెటాలియన్ అధికారులు, సిబ్బంది అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం భక్తులకు కమాండెంట్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ డి. ఆశీర్వాదం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముళ్ల పొదల్లో నవజాత శిశువు

- ఆసుపత్రికి తరలిస్తుండగా మృత్యువాత
- వినుకొండ రూరల్ మండలం నడిగడ్డలో ఘటన



నవజాత శిశువు

**వినుకొండ:** వినుకొండ రూరల్ మండలం నడిగడ్డ గ్రామంలో నవజాత శిశువును ముళ్లకంపలో పడేసిన దారుణ సంఘటన గురువారం ఉదయం జరిగింది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగానే శిశువు ప్రాణాలు కోల్పోయింది. సేకరించిన వివరాల ప్రకారం... గ్రామంలోని రోడ్డు పక్కన ముళ్ల కంపలో శిశువు ఏడుపు వినిపిస్తుండటంతో స్థానికులు గమనించి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారొచ్చి మగ శిశువుగా గుర్తించారు. శిశువును బతికుండగానే ముళ్ల పొదల్లో వదిలిపెట్టడం చూపరులను సైతం కలచివేసింది. కదలలేని స్థితిలో ఉన్న శిశువును ఓ వైపు చీమలు కుడుతుండగా.. ముళ్లు గుచ్చుకుంటూ రక్తం కారింది. తొలుత ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత స్పందించారు. ప్రథమ చికిత్స అనంతరం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలిస్తుండగా పేరేచర్ల వద్దకు వెళ్లగానే శిశువు మృతి చెందింది.

### తిరునాళ్లలో దొంగల చేతివాటం

పెద్ద ఎత్తున సెల్‌ఫోన్‌లు, బైకులు చోరీ

**నరసరావుపేట రూరల్:** కోటప్పకొండ తిరునాళ్లలో దొంగలు తమ చేతివాటం ప్రదర్శించారు. తిరునాళ్లకు వచ్చిన యాత్రికుల పర్సులు, సెల్‌ఫోన్‌లు అపహరించారు. ఈ మేరకు బాధితులు పలువురు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. నరసరావుపేటకు వచ్చేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కిన ప్రయాణికుడు టిక్కెట్టు తీసుకునేందుకు ప్రయత్నించగా అప్పటికే జేబులోని డబ్బును దొంగలు కాజేశారు. గత్యంతరం లేక బస్సులో నుంచి దిగిపోయాడు. తిరునాళ్లలో ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శన చూసే సమయంలో, ప్రధాన రహదారుల్లో రద్దీగా ఉండే ప్రాంతాల్లో దొంగలు చేతికి పనిచెప్పారు. అలాగే ద్విచక్రవాహనాలు కూడా చోరీకి గురయ్యాయి. ఖాళీ ప్రదేశాల్లో ద్విచక్ర వాహనాలను నిలిపి తిరునాళ్లకు వెళ్లిన వారి వాహనాలను చోరీ చేశారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**చిలకలూరిపేట టౌన్:** మహా శివరాత్రి పర్వదినం జాగారం చేసి తిరిగి ఇంటి వచ్చే క్రమంలో రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన చిలకలూరిపేట మండలంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేమూరు మండలం వరహాపురం గ్రామానికి చెందిన కొందరు పర్చూరు మండలంలోని అన్నంబొట్లవారిపాలెం గ్రామానికి ఇటీవల పొగాకు కోతలకు వచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం మహా శివరాత్రి నేపథ్యంలో కోటప్పకొండకు కొమరగిరి శ్రీకాంత్, చౌటురి సురేంద్రబాబులు బైక్‌పై బుధవారం రాత్రి వెళ్లారు. రాత్రంతా జాగారం చేసి తిరిగి వచ్చే క్రమంలో గురువారం తెల్లవారుజాము 4.30 సమయంలో పోతవరం బటర్‌ఫ్లై వెంచర్ సమీపంలో వీరు నడుపుతున్న బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. బైక్‌పై వెనుక కూర్చున్న సురేంద్రబాబు(21)కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం నడుపుతున్న శ్రీకాంత్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతుడి సోదరుడు శివకృష్ణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## శాసనమండలి వ్యవస్థను కలుషితం చేసిన టీడీపీ

- ఆ పార్టీ అక్రమాలు అడ్డుకుని ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- మున్సిపల్ హైస్కూలులో ఓటు హక్కు వినియోగం



ఓటు హక్కు వినియోగించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

**నరసరావుపేట:** విద్యావంతులు, పట్టభద్రులను శాసనమండలికి పంపించాల్సిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తొలిసారిగా రాజకీయ నాయకులను పోటీకి నిలబెట్టి వ్యవస్థను కలుషితం చేసిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి స్థానిక మున్సిపల్ హైస్కూలులోని బూత్ వద్దకు వచ్చిన ఆయన సాధారణ ఓటర్లతో కలిసి అరగంట సేపు క్యూలో నిల్చొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం బూత్ బయట విలేకరులతో మాట్లాడారు. విద్యావంతులు, పట్టభద్రులను చట్టసభలకు పంపించి ప్రజలకు ఉపయోగపడే మంచి చట్టాలను అందించేందుకు రాజ్యాంగం శాసనమండలి అనే వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. వారిని ఎన్నికల ద్వారా మండలికి పంపే వీలును ప్రజలకు కల్పించిందన్నారు. అయితే టీడీపీ ఈ ఎన్నికల్లో కూడా రాజకీయాలకు సంబంధించిన వ్యక్తులను పోటీలో నిలిపి వ్యవస్థను కలుషితం చేసిందన్నారు. బూత్‌లలో పార్టీకి సంబంధించిన కార్యకర్తలను ఏజెంట్లుగా కూర్చోబెట్టి దొంగ ఓట్లు పోల్ చేయించుకోవడానికి ప్రయత్నించారని ఆరోపించారు. ఓటర్ జాబితా కూడా తప్పుల తడకగా ఉందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని, తక్షణమే పోలింగ్ అధికారులు, కలెక్టర్ స్పందించి అక్రమాలను కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలను నిజాయతీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు హాలీవుడ్ రఘు, అచ్చి శివకోటి ఉన్నారు.

## దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

**బాపట్ల టౌన్:** ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో అక్రమాలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన తనపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్. అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం బాపట్ల పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో సాయంత్రం 4.15 గంటల సమయంలో పోలింగ్ సమయం ముగిసిన తర్వాత గొలపల శ్రీనుతోపాటు మరికొందరు లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వారిని ఎలా లోపలికి అనుమతిస్తారని ఎస్ఐను ప్రశ్నించానని తెలిపారు. ఇంతలో 'నువ్వు ఎవడవిరా ఇక్కడ మాట్లాడటానికి' అంటూ తనపై ఒక్కసారిగా దాడికి దిగారన్నారు. గొలపల శ్రీనుతోపాటు మరికొంతమంది దాడి చేశారని తెలిపారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన వెంట ప్రజాసంఘాల నాయకులు ఉన్నారు.

## గుండెపోటుతో పీఏసీఎస్ మాజీ చైర్మన్ మృతి



తుమ్మా చిన్నపరెడ్డి (ఫైల్)

**అచ్చంపేట:** వైఎస్సార్ సీపీ నాయకులు, అచ్చంపేట పీఏసీఎస్ మాజీ చైర్మన్ మాజీ సర్పంచ్ తుమ్మా చిన్నపరెడ్డి (67) గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆయన గత నెలరోజులుగా గుంటూరులో చికిత్స పొందుతూ, నాలుగు రోజుల క్రితం మెరుగైన వైద్యం కోసం వారి కుమారులు హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం 4 గంటల సమయంలో మృతి చెందారు. మండలంలో వైఎస్సార్ సీపీకి పెద్దదిక్కుగా, మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు ఆత్మీయునిగా పేరుంది. 2019లో వైఎస్సార్ సీపీకి మెజార్టీ రావడానికి ప్రధాన పాత్ర పోషించారు. చిన్నపరెడ్డి కన్నుమూసిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, వారి సతీమణి వసంతకుమారి, వారి తనయుడు కళ్యాణ్ బాబులు చిన్నపరెడ్డి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియచేశారు. పార్టీకి పెద్దదిక్కును కోల్పోవడం చాలాబాధాకరమని విచారం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ, నాయకులు, అభిమానులు అచ్చంపేట నుంచి స్వగ్రామమైన తాళ్లచెరువు వరకు భారీ ఊరేగింపు, బైక్‌ర్యాలీతో అంత్యక్రియల్లో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ గంగసానిబాబు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, వ్యవసాయ యూనివర్సిటీ మజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, అచ్చంపేట సర్పంచ్ షేక్ జాని, మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు తదితరులు మృతదేహాన్ని సందర్శించి తమ గ్రాఢ సంతాపాన్ని తెలిపారు.

## భవనంపై నుంచి జారి పడిన కూలీలు

ఇద్దరికి తీవ్ర గాయాలు



క్షతగాత్రులు బాణావత్ రాంబాబు నాయక్, ఖాజావలి

**సత్తెనపల్లి:** బిల్డింగ్ పై నుంచి జారిపడి ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలైన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని నాగన్న కుంటలో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి... పట్టణంలోని నాగన్న కుంటలో మున్సిపల్ ఉద్యోగి మొహిద్దిన్ ఇంటిపై వాటర్ ట్యాంకును ఏర్పాటు చేసేందుకు పట్టణంలోని బాణావత్ రాంబాబు నాయక్, ఖాజావలి అనే ఇద్దరు కూలీలను పని నిమిత్తం మాట్లాడుకున్నారు. వారు వాటర్ ట్యాంకు లాగేందుకు తాళ్లు కట్టగా, తాడు సరిపోకపోవడంతో అదనపు తాడు కట్టి పైకి లాగే క్రమంలో తాడు తెగిపోయింది. కార్మికులు ఒక్కసారిగా మూడు అంతస్తుల భవనం పై నుంచి జారిపడ్డారు. ఈ ఘటనలో బాణావత్ రాంబాబు నాయక్ నడుముకు తీవ్ర గాయాలు కాగా, ఖాజావలికి తలకు, తదితర చోట్ల గాయాలయ్యాయి. సంఘటన జరిగిన వెంటనే క్షతగాత్రులను పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించగా ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు ఇలాంటి కూలీలకు అండగా నిలిచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. బాధితుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## దొంగ ఓట్లు వేయించిన అధికారపక్షం

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి



కొల్లూరులో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి

**కొల్లూరు:** అధికార పక్షం తప్పొప్పులు తెలుసుకోవాలంటే తప్పనిసరిగా ప్రతిపక్షానికి స్వేచ్ఛ అవసరం అని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి అన్నారు. గురువారం కొల్లూరులో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరపున ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు ఆమె వచ్చారు. టీడీపీ నాయకులు పోలింగ్ బూత్‌ల వద్ద వ్యవహరిస్తున్న తీరు చూసి మండిపడ్డారు. టీడీపీ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, ఏజెంట్లను బెదిరించి కూర్చోకుండా చేయడం దారుణమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లూరులో ఓ యువకుడు పీడీఎఫ్ అభ్యర్థికి ఏజెంట్‌గా ఉంటున్న విషయాన్ని తెలుసుకొని ఇసుక క్వారీలో పనిలేకుండా చేస్తామని బెదిరించారు. చుండూరు మండలంలో సైతం ఏజెంట్‌లుగా ఉన్న వారిని అడ్డుకోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు. పలు మండలాలతోపాటు, కొల్లూరులో సైతం టీడీపీ నాయకులు గుంపులుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకొని దొంగ ఓట్లు వేయించారన్నారు. పట్టభద్రులు, ఉద్యోగులపై సైతం టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికే కాదు, అధికార పక్షానికే నష్టమన్నారు. బెదిరింపులకు పాల్పడటంపై ఆమె ధ్వజమెత్తారు. పట్టభద్రులకు సరైన స్వేచ్ఛ ఇవ్వకుండా టీడీపీ నాయకులు బెదిరింపులకు దిగడం మంచి చర్య కాదన్నారు. ఆమె వెంట ప్రజాసంఘాల నాయకులు బి. సుబ్బారావు, బీఎల్‌కే ప్రసాద్ ఉన్నారు.

## పాత జాతీయ రహదారిపై బైకు ప్రమాదం

- నుజ్జు నుజ్జయిన ద్విచక్ర వాహనం
- స్వల్ప గాయాలతో బయటపడ్డ విద్యార్థి

**తాడేపల్లి రూరల్:** మంగళగిరి నుంచి ప్రకాశం బ్యారేజీకు వెళ్లే పాత జాతీయ రహదారిపై పాత పెట్రోల్ బంక్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరిలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్న విజయవాడకు చెందిన విద్యార్థి స్నేహితుడితో కలసి బ్యారేజ్ నుంచి ఉండవల్లి సెంటర్ మీదుగా ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. పాత జాతీయ రహదారిపై పోలకంపాడు లారీ స్టాండ్ వద్ద ఎదురుగా వస్తున్న అగ్నిమాపక వాహనాన్ని రాంగ్‌రూట్‌లో వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం ముందు టైర్ ఊడిపోయి నుజ్జునుజ్జయింది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు విద్యార్థుల్లో ఒకరికి స్వల్ప గాయాలు కాగా, మరొకరు సురక్షితంగా బయటపడ్డాడు. స్వల్పంగా గాయపడిన విద్యార్థిని ప్రైవేటు వాహనంలో విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.